E69 NEWS
# తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA సంపుటి : 01 సంచిక : 136 శుక్రవారం, ఏప్రిల్ 24, 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-




- కార్మికులు ఎలాంటి ఉద్రేకపూరిత చర్యలకు దిగొద్దు
- కాళేశ్వరం తీర్పు పరిశీలించాక తదుపరి చర్యలు
- సిబిఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయం
- మంత్రుల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయల చెల్లింపు
- వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు
- సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం
- వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి

# ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు


**హైదరాబాద్,ఏప్రిల్ 23 :** ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు జరుపనుంది. కార్మికులు ఎలాంటి ఉద్రేకపూరిత చర్యలకు దిగొద్దని కేబినేట్ విజ్ఞప్తి చేసింది. కాళేశ్వరం తీర్పు పరిశీలించాక తదుపరిచర్యలు తీసుకోవాలని, న్యాయనిపుణులతో సంప్రదించాలని, సిబిఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయల చెల్లింపునకు ఉపయోగించాలని నిర్ణయించారు. వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు చేయనున్నారు. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణ కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాల వివరాలు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి శ్రీహరిలు వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలకంగా చర్చ జరిగింది. సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తూ, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేసిన ఆయన.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రుల కమిటీతో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు పిలుపు నిచ్చింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రుల బృందం కార్మిక సంఘాలతో భేటీ మిగతా2లో...

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో
# భాజపాదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



**కోల్‌కతా,ఏప్రిల్ 23 :** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో మిగతా2లో...


2లో

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు
- వాహనాలు ఢీకొనడంతో మంటలు
- చెలరేగి 11మంది సజీవ దహనం

## రాహుల్‌తో పిసిసి చీఫ్ భేటీ

- రాష్ట్రంలో తాజా రాజకీయాలపై వివరణ
- పార్టీ సంస్థాగత నిర్మాణపైనా చర్చ
- నామినేటెడ్ పదవులు, బిసి కులగణనపై ప్రస్తావన


2లో

# పోలింగ్ ప్రశాంతం

● తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్ ● బెంగాల్‌లో ఘర్షణలు.. పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తం ● ఓటేసిన సినీతారలు, ప్రముఖులు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23 :** తమిళనాడు, పశ్చిమ బెంగాల్(తొలివిడత) అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. గతంతో పోల్చితే పశ్చిమబెంగాల్‌లో 91.35 శాతం నమోదైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదైంది. చెన్నైలో 84.29 శాతం పోలింగ్ నమోదు కాగా బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పూర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్టు మిగతా2లో...

## ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



**గజ్వేల్,ఏప్రిల్ 23 :** సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ - సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస్'...ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్/ ఎక్విప్ మెంట్(వోఎఫ్ సీఈ), ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ మిగతా2లో...

## హైకోర్టు తొలి మహిళా సిజెగా జస్టిస్ లిసా గిల్

- అభినందనలు తెలిపిన సిఎం చంద్రబాబు


2లో



## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం
- ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి


**హైదరాబాద్,ఏప్రిల్ 23 :** తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం మిగతా2లో...

## కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది..?

- హైకోర్టు తీర్పు పుణ్యం రేవంత్ రెడ్డిదే
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్ 23 :** కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ వ్యాఖ్యానించారు. గురువారంఆయన మాట్లా డుతూ.. కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఎందుకు చర్యలు తీసుకో వడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ములేకే తమపై విమర్శలు చేస్తున్నారని మిగతా2లో...



## వర్సిటీలు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి: గవర్నర్

**హైదరాబాద్,ఏప్రిల్ 23 :** విశ్వవిద్యాల యాలు కేవలం డిగ్రీలు అందించే కేంద్రాలుగా కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సామర్థ్యం, పరిశోధన ఆధారిత వృద్ధిపై దృష్టి సారించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా సూచించారు. గురువారం లోక్‌భవన్‌లో వర్సిటీల వీసీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపకులపతులు స్వయంగా తరగతులు బోధిస్తూ విద్యా నాయకత్వానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రభుత్వం కోర్సుల రూపకల్పన, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి జాతీయ కార్యక్ర మాలపై దృష్టిసారించాలని తెలిపారు.ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. జాతీయ, మిగతా2లో...

## ఆర్టీసీ సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు


2లో

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటు దారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను ప్రోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయా లి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝల్మురిని కూడా అందజేస్తారు. ఝల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

కానుంది. ఈ క్రమంలోనే తెలంగాణ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. ఇకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల వేతనాల్లో 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాలని కేబినెట్ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అలాగే, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కూడా నిర్ణయించినట్లు చెప్పారు. ఆర్టీసీ సమ్మెపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. సమస్య పరిష్కారానికి ఐదుగురు మంత్రులతో కార్మిక సంఘాలతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. కార్మికులు క్షణికావేశానికి లోనుకావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, చర్చల ద్వారా పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అలాగే, రెవెన్యూ రిసోర్సెస్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కూడా కేబినెట్ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికులు తొందరపడొద్దని, డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. కార్మికులు ప్రాణాలు తీసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే, కార్మికులు సంయమనం పాటించాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సరైంది కాదని, ఆర్టీసీ కార్మికుల పాత్ర రాష్ట్ర సాధనలో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని ఆయన కోరారు. అలాగే, కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపైనా కూడా చర్చ జరిగింది. ఈ కేసులో సిబిఐ విచారణకు ఒత్తిడి తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇకపోతే గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టింది. తెలంగాణ ఏర్పడే నాటికి ఒక్క రూపాయి కూడా బకాయి లేదు. రిటైర్మెంట్ ఏజ్ పెంచటంతో పాటు రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గం ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా వెంటనే వారికి ఇచ్చే బకాయిల చెల్లింపులకు తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవసరమైతే తమ జీతాలు, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని మంత్రులందరూ ఉదారంగా ముందుకువచ్చారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరపాలని, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. పీఏసీఎస్ ఛైర్మన్లను రాబోయే రోజుల్లో నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు టాటా సంస్థ అంగీకరించింది. ఈ స్టేడియంలోని 76 ఎకరాలను రూ.700 కోట్లతో అభివృద్ధి చేయనుందని తెలిపారు.

# కాళేశ్వరంపై సుప్రీం కోర్టులో అప్పీల్

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్,ఏప్రిల్ 23 :** కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు,





మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్‌కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

## రాహుల్‌తో పిసిసి చీఫ్ భేటీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు. తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్వేషన్లనూ జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు. ఈ విజ్ఞప్తులకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి బృందం నేడు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసింది. ఈ బృందంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నేత వి. హనుమంతరావు కూడా ఉన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరుపై ఈ సందర్భంగా కీలక చర్చలు జరిగాయి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు ప్రజల్లోకి ఏ మేరకు వెళ్తున్నాయనే అంశంపై రాహుల్ ఆరా తీసినట్టు సమాచారం. ముఖ్యంగా సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే దిశగా మహేష్ కుమార్ గౌడ్ రాహుల్‌కు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ భేటీలో బీసీ జనగణన ప్రధానాంశంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. 'బీసీ గణన చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు, కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావాలి' అని రాహుల్ పేర్కొన్నట్టు సమాచారం. బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తీపి కబురు అందిస్తూ మహేష్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టులను మే నెలలోగా భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, త్వరలోనే తుది నిర్ణయం వెలువడుతుందని తెలిపారు. రాహుల్ గాంధీతో భేటీ అత్యంత సంతృప్తికరంగా సాగిందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి రాహుల్ కొన్ని సూచనలు చేశారని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**లక్నో,ఏప్రిల్ 23 :** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

## పోలింగ్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. అప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు.తమిళనాడులో 234 స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఓటర్లు ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తన కుటుంబసభ్యులతో వచ్చి ఓటు వేశారు. సినీతారలు, ప్రముఖ రాజకీయ నాయకులు రజనీకాంత్, కమల్‌హాసన్, టీవీకే అధినేత విజరు తదితరులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. **పశ్చిమబెంగాల్‌లో అక్కడక్కడ ఉద్రిక్తతలు** పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ఉద్రిక్తత, అశాంతి నెలకొన్నట్టు వార్తలు వచ్చాయి. ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలకు, ఏయూజేపీ వ్యవస్థాపకుడు హుమాయున్ కబీర్‌కు మధ్య ఘర్షణ జరిగింది.సిలిగురిలో టీఎంసీ, బీజేపీ కార్య కర్తల మధ్య వేర్వేరు ఘర్ష ణలు జరిగినట్టు సమా చారం. కుమార్ గంజ్‌లో తన పోలింగ్ ఏజెంట్లను పలు బూత్‌ల నుంచి తొల గించారని బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్ ఆరోపిం చారు.తనపై దాడి జరిగిం దనీ ఆయన పేర్కొన్నారు.

## హైకోర్టు తొలి మహిళా సిజెగా జస్టిస్ లిసా గిల్

**అమరావతి,ఏప్రిల్ 23 :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా నియమితులైన జస్టిస్ లిసా గిల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ చరిత్రాత్మక మైలురాయి.. ఉన్నత న్యాయవ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించే దిశగా కీలక ముందడుగును సూచిస్తోందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ సంబంధిత విభిన్న కేసులను సమర్థంగా నిర్వహిస్తూ.. విశిష్టమైన, ఆదర్శప్రాయమైన న్యాయవృత్తిని నిర్మించుకున్నారని తెలిపారు. న్యాయం పట్ల నిబద్ధతతో గౌరవాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. జస్టిస్ లిసా గిల్ పదవీకాలం విజయవంతంగా, స్ఫూర్తిదాయకంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ లిసా గిల్ నియమితులైన విషయం తెలిసిందే. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నియామకానికి ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. సీజేగా జస్టిస్ లిసా గిల్ నియామకం ఈ నెల 25 నుంచి అమల్లోకి వస్తుందని అందులో పేర్కొంది. హైకోర్టు ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఈ నెల 24న పదవీ విరమణ చేయనున్నారు.

## ఆర్టీసీ సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత

**హైదరాబాద్,ఏప్రిల్ 23 :** కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ఆయన తీవ్రంగా స్పందిం చారు. ప్రభుత్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని మండిప డ్డారు. పీఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా బీజేపీ పార్టీ కార్యకర్తలు వారికి మద్దతుగా ఉంటారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని.. లేదంటే బీజేపీ తరుఫున ఆందోళనలో పాల్గొంటామని అన్నారు. రేపు(శుక్రవారం) ఆర్టీసీ కార్మికు లతో ప్రభుత్వం చర్చలు జరపాలని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

## కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది..?

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. రెండేళ్లు ఫామ్‌హౌస్‌లో పడుకుని ఇప్పుడు మళ్లీ కేసీఆర్ మోటార్లకు మీటర్లు అంటు న్నారని కేంద్ర మంత్రి సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేకపోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి న్యా యం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని.. కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్

(మొదటి పేజీ తరువాయి)

(ఐఈటీ), టెక్నాలజీ / డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో బేకర్ హ్యూస్.... ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ విభాగానికి అవసరమైన హై ప్రెసిషన్ ఉత్పత్తులు తయారవుతాయి.కొత్తగా 230 హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కి ఉపాధి లభిస్తుంది. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' మరింత విశ్వవ్యాప్తం అవుతుంది.

## వర్సిటీలు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి: గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను ఉన్నత విద్య, పరిశోధనలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, ఆయా వర్సిటీల వీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ ఎంపీని కలిసిన బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు, సభ్యులు



**తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఏప్రిల్ 23** హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చకిలం ఉపేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలు, కోర్టు సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు న్యాయసేవలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం వంటి అంశాలపై చర్చించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. న్యాయవాదుల సంక్షేమం, కోర్టుల మౌలిక వసతుల పెంపు కోసం తన వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడు చకిలం ఉపేందర్‌తో పాటు సభ్యులను ఎంపీ అభినందించారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణలో, ప్రజలకు మెరుగైన న్యాయసేవలు అందించడంలో ముందుండాలని సూచించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు లలిత కుమారి, సాంబశివరాజు తదితర సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## టీపిటిఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**తెలుగు గళం న్యూస్ జనగామ ఏప్రిల్ 23** బచ్చన్నపేట మండలంలో టీపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మల్లా రెడ్డి ఆధ్వర్యంలో టీపిటిఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టీపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకుషావలి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వెంకట్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఏప్రిల్ 30న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో విద్యాశాఖ సంచాలకులు డా. నవీన్ నికోలస్, కోదండరామ్, హరి గోపాల్, చింతకింది కాసిం తదితర ప్రముఖులు ఉపన్యాసాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమాజ సమస్యల పరిష్కారానికి ఈ విద్యా సదస్సు మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొంటూ, అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ గిరీష్, నర్సింహారెడ్డి, మహంకాళి యాదగిరి, బాలరాజు, గట్టు రామచంద్రం, యాదగిరి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## చిన్నారుల విద్యా ప్రయాణంలో తొలి విజయం: పల్లవి మోడల్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ వేడుక

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 23**



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ప్రీ-ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ మాట్లాడుతూ, అన్నారంలో పాఠశాల స్థాపనతో గ్రామానికి మంచి గుర్తింపు వచ్చిందని, పాఠశాల రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చినందుకు యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, విలువలు అలవరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. 2025-26 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. హాజరు శాతం ఆధారంగా ప్రతి తరగతిలో ఫస్ట్, సెకండ్ స్థానాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. పాఠశాల చైర్మన్ రాచకొండ అశోకచారి మాట్లాడుతూ "గ్రాడ్యుయేషన్ డే ఒక వేడుక మాత్రమే కాదు, చిన్నారుల విద్యా ప్రయాణంలో మొదటి విజయాన్ని సంబరంగా జరుపుకునే సందర్భం. ఈ రోజు ఈ చిన్నారుల చేతుల్లో సర్టిఫికెట్లు ఉన్నాయి, రేపు దేశ భవిష్యత్తు వారి చేతుల్లో ఉంటుంది" అని అన్నారు. విద్యార్థులు విద్యలో, క్రీడలలో సమానంగా ప్రతిభ కనబరచాలని, ఇంటి వద్ద తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో క్రమబద్ధంగా చదవాలని సూచించారు. కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు పెంపొందితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఢిల్లీలో పాల్గొన్న విద్యార్థిని సింధును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గాడిపెల్లి రాజబాబు, ముంజంపల్లి నాగరాజు, పస్తము రాధిక సుధాకర్, చైర్మన్ రాచకొండ అశోకచారి, కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పు స్వాగతం

**కాంగ్రెస్‌కు చెంపపెట్టు: బిఆర్ఎస్ నేత నగేష్ ముదిరాజ్**



**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ ఏప్రిల్ 23;**
కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పును బిఆర్ఎస్ స్వాగతించింది. ఈ మేరకు పార్టీ సీనియర్ నాయకుడు నగేష్ ముదిరాజ్ తెలిపారు. ఇందిరా పార్క్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ అనేది ప్రదేశ్ కాంగ్రెస్ రిపోర్ట్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై చిల్లర రాజకీయాలు మానుకుని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కక్షసాధింపు చర్యలను విరమించి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయి ఉంటే లక్షల ఎకరాల్లో వరి సాగు ఎలా సాధ్యమైందో చెప్పాలని ప్రశ్నించారు. దేశంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ ముందంజలో నిలవడం వెనుక ఈ ప్రాజెక్టు పాత్ర ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాజెక్టులకు కాళేశ్వరం నీటి సరఫరా ఎలా జరుగుతోందో వెల్లడించాలని కోరారు.

# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో భూమి వారోత్సవాలు



**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్23(తెలుగుగళం)న్యూస్:**
సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం భూమి వారోత్సవాల సందర్భంగా మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రాంగణంలో విస్తృతంగా మొక్కలు నాటారు. కళాశాల కార్యదర్శి, ప్రతినిధి దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల నాటకం, ప్రాంగణ పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలు, వ్యర్థాల నిర్వహణ, సుస్థిరత ప్రతిజ్ఞ, పచ్చదనం కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించడం, సుస్థిర జీవన విధానాలపై చైతన్యం కల్పించడం లక్ష్యమని పేర్కొన్నారు. ఏప్రిల్ 22 నుంచి 29 వరకు భూమి వారం సందర్భంగా భారత్ సస్టైనబిలిటీ మిషన్--2026 కింద దేశవ్యాప్తంగా పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కళాశాల చైర్మన్, పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సైన్స్, మానవీయ శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ షేక్ మీరాసాహెబ్, వివిధ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, జాతీయ సేవా పథకం అధికారి బలుసుపాటి సీతారాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# చార్‌ధామ్ యాత్రికులు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి** పవిత్ర చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తులు తమ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హితవు పలికారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలు సముద్ర మట్టానికి సుమారు 2700 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో, హిమాలయ పర్వత శ్రేణులలో ఉన్నందున అక్కడి వాతావరణ పరిస్థితులు యాత్రికులపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. తీవ్రమైన చలి, ఆక్సిజన్ స్థాయిలు తక్కువగా ఉండటం, గాలి పీడనం తగ్గడం వంటి కారణాల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, అందుకే యాత్రికులు శారీరకంగా, వైద్యపరంగా పూర్తి సిద్ధతతో వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా 55 ఏళ్లు పైబడిన వారు, గుండె సంబంధిత వ్యాధులు, ఉబ్బసం, రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడేవారు తప్పనిసరిగా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకుని, నిపుణుల సలహా మేరకు మాత్రమే యాత్రకు వెళ్లాలని కలెక్టర్ స్పష్టం చేశారు. యాత్ర సమయంలో వెంట వెచ్చని దుస్తులు, వర్షం నుండి రక్షణ ఇచ్చే సామగ్రి, అత్యవసర మందులతో పాటు పల్స్ ఆక్సిమీటర్, థర్మామీటర్ వంటి పరికరాలను ఉంచుకోవాలని తెలిపారు. యాత్రలో ఉన్నప్పుడు రోజుకు కనీసం 2 లీటర్ల నీరు త్రాగడం, పోషకాహారం తీసుకోవడం మరియు శ్వాస వ్యాయామాలు చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. యాత్ర మార్గంలో ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మైకం లేదా వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని కోరారు. గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, అధిక బరువు ఉన్నవారు ప్రయాణంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. యాత్ర సాగుతున్నంత కాలం మద్యం, ధూమపానం, నిద్ర మాత్రలు మరియు కెఫీన్ అధికంగా ఉండే పానీయాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన 104 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని, యాత్రికుల భద్రత కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ వివరించారు.




# శ్రీరాముల శైలజకు ఉమెన్ లీడర్ షిప్ ఇంటర్నేషనల్ అవార్డు

- బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్న శైలజ
- మహిళా హక్కుల కోసం వారి చైతన్యం కోసం శైలజ తన పోరాటాలతో ముందుంటుందని కొనియాడిన వక్తలు




**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలానికి చెందిన శ్రీరాముల శైలజకు ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డు దక్కింది. బహుజన సాహిత్య జాతీయ అకాడమీ ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర కాన్ఫరెన్స్ హైదరాబాద్ నగరంలోని సుందరయ్య కళా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్, తహశీల్దార్ల అసోసియేషన్ మహిళా రాష్ట్ర అధ్యక్షులు పొడపంగి రాధా, ప్రముఖ రచయిత గాయకులు గిద్దె రామ్ నర్సయ్య లు పాల్గొన్నారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా శ్రీరాముల శైలజ ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న శ్రీరాములు శైలజ జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ జోగయ్యపల్లె గ్రామానికి చెందినవారు. శైలజ మహిళా సంఘాల్లో చురుగ్గా పనిచేస్తూ మహిళలను అన్ని రంగాల్లో చైతన్య పరుస్తూ పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని అదేవిధంగా జోగయ్యపల్లె గ్రామపంచాయతీ 9 వ వార్డులో వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కూడా అయ్యారు. ఆమె పనితనాన్ని గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఆమెకు ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డు అందించారు. ప్రతి ఏటా సామాజికంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరినీ గుర్తించి అవార్డులను అందించడం జరుగుతుందని రాధాకృష్ణ తెలిపారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించడం బహుజన సాహిత్య అకాడమీ ప్రత్యేకత గా పేర్కొన్నారు. శ్రీరాముల. శైలజ జిల్లాలో మహిళా హక్కుల కోసం మహిళా సమస్యల మీద అనేక పోరాటాలు చేసిన ఘనత ఆమె సొంతమని అన్నారు. అవార్డు అందుకున్న శ్రీరాముల శైలజ ఈ సందర్భంగా మాట్లాడుతూ అవార్డు అందుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. సమాజంలో మరింత సేవ అందించేందుకు తనకు మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. ఆమెను పలువురు వక్తలు అభినందించారు. ఈ అవార్డు అందించిన జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు ఎం ఎం గౌతమ్ కోఆర్డినేటర్ విష్ణు, కార్యదర్శి కనుకుంట్ల విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు టేకి రాజ శేఖర్, బహుజన సాహిత్య అకాడమీ హైదరాబాద్ నగర్ మహిళా వింగ్ అధ్యక్షురాలు జ్యోతి, అవార్డుల ప్రారంభంలో కమిటీ జయశంకర్ భూపాలపల్లి సెలక్షన్ కమిటీ మెంబర్ తాటికంటి ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.



# నిర్ణీత గడువులోగా సరస్వతి అంత్య పుష్కరాల పనులు పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
భక్తుల సౌకర్యార్థం సరస్వతి అంత్య పుష్కరాల పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేసి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా కాళేశ్వరంలోని సరస్వతి ఘాట్ వద్ద జరుగుతున్న ఘాట్ నిర్మాణం, షట్టరింగ్ పనులు, స్టాంప్డ్ కాంక్రీట్ మరియు పేవర్ బ్లాక్స్ పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తూనే వేగం పెంచాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పుష్కరాల నిర్వహణలో రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆర్ అండ్ బి వంటి వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. భక్తుల రక్షణ కోసం భద్రతా ఏర్పాట్లు, నిరంతర పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీరు మరియు రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. స్నాన ఘట్టాల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా షవర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మిలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒలింపియాడ్ లో నారాయణ విద్యార్థుల విజయ దుందుభి"



**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్23(తెలుగుగళం)న్యూస్:** సత్తుపల్లి పట్టణంలోనీ నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, సత్తుపల్లి విద్యార్థులు జాతీయ ఒలింపియాడ్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. హెచ్. ఝాన్సీ శ్రీ (గ్రేడ్--1) ఆల్ ఇండియా 1వ ర్యాంక్ సాధించగా, టి. దీక్షిత (గ్రేడ్--1) 5వ ర్యాంక్, ఆర్. యోగిత లక్ష్మి 3వ ర్యాంక్, పి. శ్రీనిధి (8వ తరగతి) 4వ ర్యాంక్‌లను సాధించారు. సీఎన్‌ఏపీఎస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఎస్ఎస్ఓ, ఎన్ టిఈఎక్స్ పరీక్షల్లో ఈ విద్యార్థులు క్యాంపస్ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు 1, 2, 3, 4 ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. హైదరాబాదులోని రవీంద్రభారతి వేదికపై జరిగిన కార్యక్రమంలో సీఎన్‌ఏపీఎస్ ప్రతినిధులు, తెలంగాణ నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్ రెడ్డి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, గోల్డ్ మెడల్స్, బహుమతులు అందజేసి సన్మానించారు. మొదటి స్థానం సాధించిన హెచ్. ఝాన్సీ శ్రీకి ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఖమ్మం జోన్‌కు చెందిన ఏజీఎం, ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్‌తో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేదరికాన్ని జయించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి** కాటారం చదువుకు పేదరికం ఎన్నటికీ అడ్డుకాదని, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవడం ద్వారా మన జిల్లా కీర్తిని దశదిశలా చాటాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం కాటారం మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" సంక్షేమ వారోత్సవాల నాలుగో రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్, విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి సంక్షేమ వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు ప్రగతి నివేదికలను పంపిణీ చేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదల మరియు క్రమశిక్షణతో ముందుకు సాగాలని హితవు పలికారు. ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయాలని, అక్కడ లభిస్తున్న సదుపాయాలను అందిపుచ్చుకుని గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, వారి ఎదుగుదలకు వెన్నుముకగా నిలవాలని కలెక్టర్ కోరారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని సరైన మార్గంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిటీడబ్ల్యూఓ నాగసాగర్, ఎంపిడిఓ బాబు, సర్పంచ్ పవిత్ర, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వడుప్సా జిల్లా కోశాధికారిగా పర్వతగిరి విద్యావేత్త సతీష్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 23**
వరంగల్ జిల్లా: పర్వతగిరి.ప్రైవేట్ పాఠశాలల సంఘం వడుప్సా (ట్రస్మా) కోశాధికారిగా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామం విజ్ఞాన భారతి హై స్కూల్ కరస్పాండెంట్ అక్కినపల్లి సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. వరంగల్ బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ప్రైవేట్ పాఠశాలల సర్వసభ్య సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోశాధికారిగా సతీష్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.తన ఎన్నికకు కృషిచేసిన ట్రస్మా రాష్ట్ర సలహాదారు యాదగిరి శేఖర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడిపల్లి వెంకటేశ్వరరావులకు సతీష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీ కాలంలో సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.సతీష్ కుమార్ ఎన్నిక పట్ల వడుప్సా సభ్యులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

# గ్రామ భద్రతకు 'సిసి' రక్షణ:రేగొండ ఎస్సై సుధాకర్ పిలుపు

**- స్పందించి రూ. 20 వేలు విరాళం అందజేసిన కనపర్తి గ్రామస్థులు**





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**
నేర రహిత సమాజ స్థాపనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, గ్రామాల రక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ఒక అనివార్యమని రేగొండ ఎస్సై డి. సుధాకర్ అన్నారు.గురువారం రేగొండ మండలం కనపర్తి గ్రామంలో గ్రామ ప్రజలతో కలిసి ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు."ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం" అని, ఇది నిరంతరం నిఘా ఉంచడమే కాకుండా, ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడంలో కీలక ఆధారంగా నిలుస్తుందని వివరించారు.గ్రామంలోని ప్రధాన కూడళ్లలో కెమెరాల ఏర్పాటు వల్ల దొంగతనాలు తగ్గడమే కాకుండా,అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు.ఎస్సై పిలుపునకు కనపర్తి గ్రామస్థులు తక్షణమే స్పందించారు. గ్రామ భద్రత తమ బాధ్యతగా భావించి,స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అక్కడికక్కడే రూ. 20,000 నగదును సేకరించి పోలీసు యంత్రాంగానికి తమ మద్దతు తెలిపారు. త్వరలోనే మరిన్ని నిధులు సేకరించి,గ్రామంలోని నాలుగు ప్రధాన దిక్కులలో మొత్తం 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు.ప్రజల చొరవను ఐక్యతను ఎస్సై సుధాకర్ ప్రత్యేకంగా అభినందించారు.కనపర్తి గ్రామస్థుల తరహాలోనే మిగిలిన గ్రామాల ప్రజలు కూడా ముందుకు వచ్చి తమ ప్రాంతాలను సురక్షితంగా మార్చుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు,యువత పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం-పరిస్థితి విషమం





**తెలుగు గళం న్యూస్, నర్సంపేట, ఏప్రిల్ 23**
వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు తీవ్రరూపం దాల్చాయి.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించి, ఇలాంటి ఆత్మహత్యాయత్నాలు ఆగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.గత రెండు రోజులుగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం తాత్కాలిక డ్రైవర్లను నియమించి బస్సులు నడిపిస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నారు.ఈ పరిణామాలపై నిరసనగా నర్సంపేట బస్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.శంకర్ ఆరోగ్య పరిస్థితి సుమారు 60--70 శాతం కాలిన గాయాలతో విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.డ్రైవర్ పరిస్థితిని తెలుసుకోవడానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆసుపత్రిని సందర్శించారు. శంకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యతతో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించి, కొనసాగుతున్న సమ్మెను విరమింపచేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఆర్టీసీ సమ్మెలో పాల్గొన్న బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు.






**వరంగల్ జిల్లా:** కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. ప్రభుత్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని పీఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ లో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీ మరిచి గద్దెనెక్కి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న కూడా వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు అన్నారు. ఇచ్చిన హామీలలో ముఖ్యమైనవి ఆర్టీసీ కార్మికుల కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారి యొక్క ప్రధానమైన డిమాండ్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ఇది అతి ముఖ్యమైన డిమాండ్. ఆర్టీసీని ప్రభుత్వ శాఖలో విలీనం చేసి కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతోంది. వేతన సవరణ పి ర్ సి అమలు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు యూనియన్ల పునరుద్ధరణ ఉ గుర్తింపు ఎన్నికలు: కార్మిక సంఘాల యూనియన్ గుర్తింపు ఎన్నికలను నిర్వహించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ సీనియర్ నాయకులు గడ్డం ఆంజనేయులు,కుంభం కోమల్ రెడ్డి, మల్యాల వినయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్ రెడ్డి, బీజేవైఎం నాయకులు జూలూరి మనీష్ గౌడ్, కొంకేస విగ్నేష్ గౌడ్, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు, ఆడెపు చందు,తప్పెట్ల సతీష్, చిలువేరు అన్వేష్,వేల్పుగొండ సుమన్ మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

## మరిపెడ మండలంలో మొబైల్ డిజిటల్ ఎక్సరే ద్వారా టీబీ నిర్ధారణ శిబిరాలు ప్రారంభం



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**
'టీబీ ముక్త్ భారత్' (క్షయ రహిత భారత్) లక్ష్యంలో భాగంగా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో మొబైల్ డిజిటల్ ఎక్సరే వాహనం ద్వారా టీబీ ఉచిత నిర్ధారణ పరీక్షలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గుగులోతు రవి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ.. టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, పూర్తిస్థాయి చికిత్స అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అత్యాధునిక డిజిటల్ ఎక్సరే సదుపాయం ఉన్న ఈ మొబైల్ వాహనం మరిపెడ మండలంలోని మరిపెడ ఎల్లంపేట, తాళ్లవుకల్, వీరారం గ్రామాల్లో నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ఈ శిబిరానికి వచ్చి ఉచితంగా ఎక్సరే పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచితంగా మందులు, పౌష్టికాహారం కోసం ఆర్థిక సహాయం అందజేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, టీబీ సూపర్వైజర్ ఆచార్యులు,ఎక్సరే టెక్నీషియన్ విజయకుమార్ ఏఎన్ఎం అశ్విని, ఆశా కార్యకర్తలు లలిత, జ్యోతి, మంగమ్మ, శ్రీజ, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనగణన 2027: ఏప్రిల్ 26 నుండి స్వీయ-గణనకు అవకాశం, ప్రజలంతా పాల్గొనాలని తహసీల్దార్ విజ్ఞప్తి



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 23**
వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం భారత జనాభా గణన-2027లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వీయ-గణన' విధానంలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పర్వతగిరి తహసీల్దార్ టి. వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు ప్రభుత్వం స్వీయ-గణన విధానాన్ని అమల్లోకి తెచ్చిందని తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి కుటుంబం తమ ఇంటి, కుటుంబ సభ్యుల వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు.స్వీయ-గణన షెడ్యూల్:ఏప్రిల్ 26 నుండి మే 10, 2026 వరకు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు.వెబ్‌సైట్:అధికారిక వెబ్‌సైట్ ద్వారా సులభంగా నమోదు చేయవచ్చు.ప్రతి కుటుంబానికి 15 రోజుల గడువు ఉంటుందని, ఈ సమయంలోనే వివరాలు నమోదు చేయాలని సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత ప్రతి కుటుంబానికి ప్రత్యేకమైన సెయిడ్ కేటాయిస్తారని, ఇది భవిష్యత్తులో వివరాలు సవరించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రం, జిల్లా, గ్రామం, పట్టణం, పిన్‌కోడ్ వివరాలను సరిగ్గా నమోదు చేయాలని కోరారు. దీనివల్ల గృహ స్థానం కచ్చితంగా నమోదై గణనలో ఖచ్చితత్వం పెరుగుతుందని, భవిష్యత్ సర్వేలకు ఉపయోగపడుతుందని అన్నారు. స్వీయ-గణనతో ప్రక్రియ వేగవంతం అవుతుందని, వివరాలు నమోదు చేయలేని వారు లేదా సాంకేతిక సహాయం కావాల్సిన వారు గణన కర్తల సహాయం పొందవచ్చని తెలిపారు.ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని సమయానికి వివరాలు నమోదు చేసి దేశ అభివృద్ధికి సహకరించాలని తహసీల్దార్ టి. వెంకటస్వామి కోరారు.

## యశోద హాస్పిటల్‌లో గొంతు క్యాన్సర్‌కు అత్యాధునిక రేడియేషన్ థెరపీతో అరుదైన చికిత్స

**తెలుగు గళం న్యూస్, ఖమ్మం / ఏప్రిల్ 24**



ఖమ్మం జిల్లాకు చెందిన 86 సంవత్సరాల వృద్ధురాలికి గొంతు క్యాన్సర్‌పై అత్యాధునిక సాంకేతికతతో విజయవంతమైన చికిత్స అందించినట్లు హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు.శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు, గొంతు నొప్పితో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా, వైద్య బృందం పరీక్షించి గొంతులో పెద్ద కణితి శ్వాస మార్గాన్ని అడ్డుకుంటోందని గుర్తించారు. అత్యవసర పరిస్థితిలో ఆమెకు ట్రాకియోస్టమీ నిర్వహించి శ్వాసనాళికను తెరిచారు.తదుపరి పరీక్షలైన పీఈటీ-సీటీ స్కాన్, బయాప్సీ ద్వారా ఆమెకు హైపోఫారింజియల్ క్యాన్సర్ లారింక్స్ వరకు వ్యాపించినట్లు నిర్ధారణ అయింది. వయస్సు, బలహీన ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాధారణ చికిత్సలు సవాలుగా మారాయి.ఈ నేపథ్యంలో వైద్యులు ఎంఆర్ఎల్ఐఎన్ఏసీ సాంకేతికతతో హైపోఫ్రాక్షనేటెడ్ రేడియోథెరపీ అందించారు. కొద్ది రోజుల్లోనే చికిత్స పూర్తి చేసి, ఆమెను క్రమంగా కోలుకునేలా చేశారు.చికిత్స అనంతరం మూడు నెలల ఫాలోఅప్‌లో ఆమె పూర్తిగా క్యాన్సర్ నుంచి విముక్తి పొందినట్లు వైద్యులు తెలిపారు.ఈ సాంకేతికతతో మెదడు, ప్రోస్టేట్, ఊపిరితిత్తులు, కాలేయం వంటి వివిధ క్యాన్సర్లకు తక్కువ రోజుల్లో చికిత్స అందించవచ్చని, ఆసుపత్రి సందర్శనలను తగ్గించడంతో పాటు రోగుల ఒత్తిడిని కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అన్ని వయసుల వారికి, ముఖ్యంగా వృద్ధులకు కూడా ఇది సురక్షితమని తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ కరుమంచి మాట్లాడుతూ, "ఎంఆర్ఎల్ఐఎన్ఏసీ సాంకేతికతతో కచ్చితత్వం, భద్రత పెరగడంతో పాటు, ముందుగా నయం చేయడం కష్టమని భావించిన క్యాన్సర్లకు కూడా ఆశ కలిగిస్తోంది" అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వినీత్ ఇలాపురం, శ్రీధర్ రావు, బాలకృష్ణ, నాగార్జున పాల్గొన్నారు.

## సంక్షేమ వారంలో భాగంగా పేరెంట్స్ కు పాదాభివందనం"

**- బీసీ బాలుర వసతి గృహ విద్యార్థుల వేడుక"**











**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్23(తెలుగు గళం)న్యూస్:**
ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల వెన్నచేడు వెంకటాపురం గ్రామంలో గల బీసీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి కృష్ణకిరణ్ ఆధ్వర్యంలో గురువారం విన్నూత్న వేడుకలు ఘనంగా నిర్వహించారు.సంక్షేమ వారంలో ,99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వారి తల్లితండ్రులను వసతి గృహానికి పిలిచి వారికి విద్యార్థులతో పాదాభిషేకం కార్యక్రమాన్ని చేశారు.పుష్పాలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం పేరెంట్స్,విద్యార్థులు వసతి గృహ సంక్షేమ అధికారి పి.కృష్ణకిరణ్ కు పుష్పాలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మిరియాల రవి కు పుష్పాలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పి.కృష్ణ కిరణ్ మీడియాతో మాట్లాడుతూ జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారిని జ్యోతి,కల్లూరు అసిస్టెంట్ బీసీ సంక్షేమ డిప్యూటీ అధికారిని గ్రేసమ్మ ల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో:విద్యార్థుల పేరెంట్స్ అబ్బదాసరి రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రతిష్టంగా ఉండాలి

**- ప్రధానోపాధ్యాయులు గుడిబోయిన మాధవరావు**
**- ఎం.పీ.పీ.ఎస్ . చీమ్లా తండ ప్రైమరీ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే.**





**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**
సిమ్లా తాండ ప్రైమరీ హై స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిలాల్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిబోయిన మాధవరావు పాల్గొని ప్రసంగించారు విద్యార్థులకు ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ చాలా పటిష్టంగా ఉండాలని విద్యార్థుల యొక్క భవిష్యత్తు ఆశయాలు రూపుదిద్దుకునే సమయమని ఈ ప్రైమరీ స్థాయిలోనే విద్యార్థులను సక్రమమైన మార్గంలో నడిపిస్తే భవిష్యత్తు తరాలకు మేధాశక్తి గల విద్యార్థులు అందించవచ్చని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మానసిక ఉల్లాసాన్ని పొందారని గ్రాడ్యుయేషన్ నిర్వాణ చేయడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు ప్రభుత్వ పాఠశాలలో కూడా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ప్రధానోపాధ్యాయుల్ని, ఉపాధ్యాయులను స్థానిక సర్పంచ్ అభినందించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శివకుమారి గ్రామ కార్యదర్శిరవి,ఉపాధ్యాయులు వినయ్ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

## విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి -- క్రీడా ప్రోత్సాహంతో ముందుకు తీసుకెళ్తున్న కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి







**తెలుగు గళం న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 23**
కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ దేగలమడుగు ఎంపిపి పాఠశాలలో నిర్వహించిన ప్రగతి పత్రాల పంపిణీ కార్యక్రమం ఆకట్టుకుంది.వార్షిక పరీక్షలు పూర్తైన సందర్భంగా విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపేలా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి విద్యార్థుల సమగ్ర అభివృద్ధి పై దృష్టి సారించాలని సూచించారు.విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా క్రీడలు, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.వేసవి సెలవుల సమయంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేసి ప్రోత్సహించారు.కార్యక్రమంలో కార్పొరేటర్ చింతలపూడి సాయి కుమార్ పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సందేశాలు అందించారు.కంచర్ల కామేశ్వరరావు సహకారంతో క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది.క్రీడా సామగ్రి అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న చింతలపూడి శ్రావణి చర్యలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.

# 'అంగన్‌వాడీ సేవలు పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం



బూర్గంపహాడ్, ఏప్రిల్ 23 : అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మరింత ఆధునీ కరించడం తో పాటు అంగన్‌వాడీ సేవలు పారదర్శకంగా, సమర్ధవం తంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక వాసవీ ఫంక్షన్‌హాల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మె ల్యే ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల విధుల్లో ఆధునీకతను జోడించే దిశగా ఈ స్మార్ట్ ఫోన్లను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వీటివల్ల అంగన్‌వాడీలకు సేవలు సులభతరంగా ఉండటంతో పాటు పారదర్శకంగా ఉండేలా ఉపయోగ పడతాయన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం సేవల్లో వేగం పెరుగుతుందన్నారు.

# ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉంది

హైదరాబాద్, ఏప్రిల్ 23: ఆర్టీసీ సమ్మెలో భాగంగా రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదని.. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని ఆనాడు కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారిందని తెలిపారు. ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని చెప్పుకొచ్చారు. రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడిపో



తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు వెనకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారని.. అసలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తీరిస్తే సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని.. ప్రభుత్వం మెడలు వంచి హామీలను సాధిద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు.పీఆర్సీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారని.. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా అని నిలదీశారు. 'మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది' అంటూ ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశం అయిన వెంటనే ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. తూతూ మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. 29 డిమాండ్లు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారని.. మరి ఆ 29 డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

# రెండో రోజూ ఆర్టీసీ కార్మికుల సమ్మె - నిర్మానుష్యంగా ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు

హైదరాబాద్ :తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజూ ఆర్టీసీ కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి ఆర్టీసీ జేఏసీ సమ్మె చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు విధులకు దూరంగా ఉండటంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. జిల్లాల్లో పలు ప్రాంతాల్లో బస్సులు పాక్షికంగా నడుస్తున్నప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ యాజమాన్యం కొన్ని జిల్లాల్లో పలు ప్రాంతాల్లో అద్దె బస్సులను రోడ్డెక్కించినా, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు, ప్రైవేటు బస్సులను ఆర్టీసీ అధికారులు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నడిపిస్తున్నారు. ప్రయాణ ధరలు పెంచుతున్న ప్రైవేటు వాహనాలు : కొన్ని జిల్లాల్లో పలుచోట్ల ఉదయం నుంచే డిపోల వద్ద కార్మికులు బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను కార్మికులు అడ్డుకుంటున్నారు. కార్మికుల ధర్నాకు వివిధ పార్టీల నాయకులు ఇప్పటికే మద్దతు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వాహనదారులు ఛార్జీలు పెంచడంతో వాపోతున్నారు. ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, దినసరి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. తమ డిమాండ్లపై హామీ ఇచ్చే వరకు సమ్మె




కొనసాగిస్తామని కార్మికులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో ఆర్టీసీ డిపోల వద్ద పోలీసుల బందోబస్తు నిర్వహిస్తున్నారు. నిర్మానుష్యంగా ఎంజీబీఎస్, జేబీఎస్ : హైదరాబాద్ జంటనగరాల్లో రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఎంజీబీఎస్, జేబీఎస్ ప్రాంగణాల నుంచి ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. ప్రయాణికులు లేక ఎంజీబీఎస్, జేబీఎస్‌లు నిర్మానుష్యంగా మారాయి. ఆర్టీసీ తలపెట్టిన సమ్మె తెలియక ఎంజీబీఎస్, జేబీఎస్‌కు కొందరు ప్రయాణికులు వస్తున్నారు. ఎంజీబీఎస్, జేబీఎస్‌లో గంటల తరబడి వేచి చూస్తున్నారు. బస్సులు రాకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎంజీబీఎస్ నుంచి స్వల్ప స్థాయిలో అద్దె బస్సులు నడుస్తున్నాయి. హైదరాబాద్‌లో ప్రయాణికులు ఎక్కువగా ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లను ఆశ్రయిస్తోన్నారు. ఎంజీబీఎస్ నుంచి పొరుగు రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర బస్సులు నడుస్తున్నాయి. వరంగల్‌లో ఎక్కడికక్కడ బస్సులు : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొమ్మిది డిపోల్లో నిలిచిపోయిన 600 బస్సులు నిలిచిపోయాయి. పలు బస్టాండ్‌ల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లాలోని పరకాల ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల నిరసన చేపట్టారు. బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారుల ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ కార్మికులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 11 డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికుల సమ్మె చేస్తున్నారు. కరీంనగర్ పరిధిలోని డిపోల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అధికారులు అద్దె ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కామారెడ్డి డిపో ముందు భారీగా పోలీసులు మోహరించారు. పోలీసుల పహారా నడుమ అద్దె బస్సులను అధికారులు నడిపిస్తున్నారు. కామారెడ్డి బస్టాండ్ వద్ద కార్మికుల టెంటును పోలీసులు తొలగించారు. పోలీసులకు కార్మికులుకు వాగ్వాదం : నల్గొండ, మిర్యాలగూడ డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల ధర్నా చేశారు. బీఆర్‌టీయూ, బీఆర్ఎస్‌వీ నాయకులు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. డిపోల నుంచి వెళ్తున్న ప్రైవేటు బస్సులను కార్మికులు అడ్డుకోగా పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వాదం చెలరేగింది. సూర్యాపేటలో ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. ప్రైవేటు సిబ్బందితో నడిపిస్తున్న బస్సులను ఆర్టీసీ కార్మికులు అడ్డుకుంటున్నారు. కార్మికుల ర్యాలీ : ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని తలపెట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్? జిల్లాలోని మంచిర్యాల డిపోలో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడా నిలిచిపోయాయి. తమ సమస్యలపై ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తమ న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని, నినాదాలు చేశారు.

# కేసీఆర్‌పై చర్యలు తీసుకునే దమ్ములేకే మాపై విమర్శలు



హైదరాబాద్, ఏప్రిల్ 23: కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. గురువారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ములేకే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.రెండేళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ మోటార్లకు మీటర్లు అంటున్నారని కేంద్ర మంత్రి సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేకపోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని.. కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్?లో ఉరుములతో కూడిన వర్షం - ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


హైదరాబాద్: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు హైదరాబాద్‌లో ఎండ దంచికొట్టింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై నగరంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి వర్షం పడింది. కూకట్‌పల్లి, హైదర్ నగర్, జేఎన్టీయూ, మూసాపేట్, కేపీహెచ్‌బీ, ఆల్విన్ కాలనీ జీడిమెట్ల, సుచిత్ర, కొంపల్లి, బహదూర్పల్లి, గండి మైసమ్మ, కాప్రా, ఏఎస్ రావు నగర్, ఈసీఐఎల్ ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది.30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో : తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ, రేపు ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ద్రోణి, క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షం కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు



తెలిపింది.ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది.గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం : రేపు నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

# హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు చెప్పేవన్నీ అబద్ధాలే:

హైదరాబాద్, ఏప్రిల్ 23: కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. త్వరలోనే సంబరాల రాంబాబులను లోపలేస్తామని హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... తన సొంత బ్రాండ్ కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని.. తెలంగాణ సొమ్మును నాశనం చేశారని ఆరోపించారు. బ్రాండ్ కోసమే కేసీఆర్ తట్టెడు అబద్ధాలు, పిట్ట కథలు చెప్పారని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకే కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందని ఎంపీ ప్రశ్నించారు.'24 గంటల్లో సినిమా చూపిస్తామన్న బీజేపీ ఎక్కడికి పోయింది? సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతోంది? బీజేపీ నాయకులు వెంటనే సీబీఐతో విచారణ చేయించండి' అని డిమాండ్ చేశారు. మానిపోయిన గాయానికి మళ్లీ మందు పెట్టేందుకు కేసీఆర్



బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. కేటీఆర్, హరీశ్.. ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నారన్నారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఎంపీ తెలిపారు. కాళేశ్వరంలో దోపిడీ చేసిన వాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. సెంటిమెంట్ డైలాగులతో ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మేడిగడ్డ గుండెకాయ అన్నారని.. మేడిగడ్డ కుంగిపోయాక కాళేశ్వరం కూలిపోయినట్టే కదా అని ఎంపీ అడిగారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే ప్రమాదమని ఎన్‌డీఎస్ఏ చెప్పిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కాళేశ్వరం కూలిపోయిందన్నారు. నాణ్యత పాటించకుండా ప్రాజెక్ట్ కట్టి.. కూలిపోగానే కాంగ్రెస్‌పై కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పు పట్టలేదని తెలిపారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విచారణకు రమ్మన్న అంశంపై మాత్రమే కోర్టు అభ్యంతరం తెలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అప్పు పుట్టకపోతే కార్పొరేషన్ ఏర్పాటు చేసి అప్పు

# ఆర్టీసీ సమ్మె.. నర్సంపేటలో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం.. ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు


వరంగల్ జిల్లా: డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెలో తీవ్ర కలకలం రేపింది. వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడం ఇప్పుడు తీవ్ర సంచనలంగా మారింది. గత 2 రోజులుగా తోటి కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్న ఆ డ్రైవర్.. ఇవాళ ఒక్కసారిగా ఆత్మహత్య చేసుకునేందుకు చేసిన ప్రయత్నం.. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులను తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది. దీంతో తాము నిరసనలు వ్యక్తం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏ మాత్రం స్పందించడం లేదని.. తమ డిమాండ్లపై దిగి రావడం లేదని తీవ్రంగా మండిపడుతున్నారు.వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న కోలా శంకర్ గౌడ్.. తాజాగా ఆత్మహత్యాయత్నం చేయడం ఇప్పుడు తీవ్ర సంచలనం రేపుతోంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకపోవడం.. తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో.. గత రెండు రోజులుగా అందరితో కలిసి ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేసిన కోలా శంకర్ గౌడ్.. తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే పెట్రోల్ బాటిల్ తీసుకువచ్చి.. నర్సంపేట బస్టాండ్ ఎదురుగానే.. తన ఒంటిపై పోసు కుని నిప్పు పెట్టుకున్నాడు.అది గమనిం చిన తోటి ఆర్టీసీ సిబ్బంది.. శంకర్ గౌడ్‌ను.. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిం చారు. అయితే



పెట్రోల్ పోసుకుని నిప్పంటిం చుకోవడంతో.. శంకర్ గౌడ్ తీవ్ర గాయాల పాలయ్యారు. అతడి పరిస్థితి ఇప్పుడే ఏం చెప్పలేమని ఆస్పత్రి వర్గాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఇక శంకర్ గౌడ్‌కు ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు.గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ ఆర్టీసీ సమ్మెలో అక్కడక్కడా చిన్న చిన్న ఉద్రిక్తతలు జరగ్గా.. ఇప్పుడు ఏకంగా ఓ డ్రైవర్ తన ప్రాణాలు తీసుకునేం దుకు కూడా సిద్ధపడటం తీవ్ర దుమారం రేపుతోంది. తాము సమ్మె చేస్తున్న ప్రభుత్వం మాత్రం దిగిరా వడం లేదని ఆర్టీసీ కార్మికులు మండిపడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆర్టీసీ సిబ్బంది, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు ప్రాంతాల్లో పోలీసులు.. ఆర్టీసీ సిబ్బందిని అడ్డుకునే క్రమంలో చూపించిన అత్యుత్సాహానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# హైదరాబాద్‌లో మరో దగుల్బాజీ దందా.. భారీగా కల్తీ టీ పౌడర్ బట్టబయలు!

హైదరాబాద్, ఏప్రిల్ 23: నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాసులు కురిపించుకుంటున్న ఒక ముఠా ఆట కట్టించారుపోలీసులు. రహస్య సమాచారం మేరకు జరిపిన మెరుపు దాడుల్లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాడిన పొడికే మళ్లీ రంగులు..సాధారణంగా హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి, దానికి హానికరమైన రంగులు , కృత్రిమ వాసనలు కలిపి తిరిగి ప్యాక్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కల్తీ పొడిని చూడగానే అసలైన టీ పొడిలాగే కనిపించేలా రసాయనాలు వాడుతున్నారని పోలీసులు తెలిపారు. పోలీసుల సీక్రెట్ ఆపరేషన్ - 10 మంది అరెస్ట్ఈ దందాపై గత కొన్ని రోజులుగా నిఘా పెట్టిన పోలీసులు, అత్యంత గోప్యంగా ఆపరేషన్ నిర్వహించి కల్తీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్తీ టీ పొడిని తయారు చేసేవారితో పాటు, తక్కువ ధరకు వస్తుందని తెలిసి కూడా దీన్ని కొనుగోలు చేస్తున్న కొంతమంది టీ షాప్ ఓనర్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ కల్తీ టీ పొడిలో కలిపే రంగులు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయని ఆహార భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు



# అన్న వచ్చేస్తున్నాడు.. ఎంఎస్ ధోనీ రాకతో సీఎస్‌కే దశ మారుతుందా?

ఐపీఎల్ 2026 సీజన్ మొదలై అప్పుడే చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) 6 మ్యాచ్‌లు ఆడేసింది. కానీ కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క రూపం మాత్రం ఇంకా మైదానంలో కనిపించలేదు. తనే.. మన తలా ఎంఎస్ ధోనీ. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ధోనీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ధోనీ రీఎంట్రీ పై క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా అయితే ఎంఎస్ ధోనీ నెట్స్‌లో వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అరుదు. ఆయన ఎక్కువగా బ్యాటింగ్ లేదా సరదాగా బౌలింగ్ చేస్తూ కనిపిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు ధోనీ వికెట్ కీపింగ్ గ్లోవ్స్ ధరించి ప్రాక్టీస్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబై మాజీ ప్లేయర్ ఆదిత్య తారే దీని మీద స్పందిస్తూ.. "నేను ధోనీని నెట్స్‌లో కీపింగ్ చేయడం ఎప్పుడూ చూడలేదు. ఇది నిజంగా షాకింగ్. బహుశా ఆయన తన మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షిఁచుకుంటున్నట్లు ఉన్నారు." అని పేర్కొన్నారు. ఇది సీఎస్‌కే శిబిరంలో గుడ్ సిగ్నల్స్ పంపుతోంది.ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ కాఫ్ ఇంజూరీ (పిక్క గాయం) బారిన పడ్డారు. దీనివల్ల సీజన్ లో మొదటి 6 మ్యాచ్‌లకు ఆయన దూరమయ్యారు. ధోనీ లేకపోవడం వల్ల చెన్నై జట్టు 6 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, నాలఁగింటిలో ఓడిపోయింది. జట్టులో గేమ్ అవేర్‌నెస్ లోపించిందని, క్లిష్ట సమయాల్లో ధోనీ వంటి సీనియర్ అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఆయన ప్రాక్టీస్ మొదలుపెట్టడంతో, ఏప్రిల్ 23న ముంబైతో జరిగే మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది.గడిచిన రెండు సీజన్లలో ధోనీ లోయర్ ఆర్డర్ (నంబర్ 7 లేదా 8)లో వచ్చి మెరుపులు మెరిపించారు. 2024




ఐపీఎల్‌లో 161 పరుగులు చేసిన ఆయన, 2025 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 196 పరుగులు సాధించారు. స్ట్రైక్ రేట్ విషయంలో యువకుల కంటే బెటర్ గా ఉండటం ఆయన ప్రత్యేకత. ఈ ఏడాది కూడా అదే దూకుడును కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. రికార్డు ఉండటం ప్లస్ పాయింట్.ఐపీఎల్‌లో ముంబై, చెన్నై మ్యాచ్ అంటేనే ఒక ఎల్ క్లాసికో. ఇరు జట్లు చెరో ఐదుసార్లు టైటిల్ గెలిచాయి. ప్రస్తుత పాయింట్ల పట్టికలో చెన్నై వెనుకబడి ఉన్న తరుణంలో, ధోనీ రాక జట్టులో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో ధోనీ సలహాలు జట్టుకు కొండంత బలాన్ని ఇస్తాయి. రేపటి మ్యాచ్‌లో ధోనీ టాస్ సమయానికి జట్టులో ఉంటారా లేదా అన్నదే ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న.

# పంత్ భయ్యా.. ఇదేం బ్యాటింగ్?

ఐపీఎల్ 2026లో భాగంగా లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన 32వ పోరులో రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ లో-స్కోరింగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను వారి సొంత గడ్డపైనే చిత్తు చేసి, రాజస్థాన్ తన విజయ పరంపరను మళ్లీ మొదలుపెట్టింది. ఐపీఎల్ 2026 సీజన్ 32వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు సమిష్టిగా రాణించి తమ జట్టుకు 40 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని అందించారు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (43ి) ఆఖర్లో కీలక ఇన్నింగ్స్ ఆడటంతో రాజస్థాన్ గౌరవప్రదమైన స్కోరును బోర్డుపై ఉంచగలిగింది. లక్నో బౌలర్లలో షమీ, మోహ్సిన్ ఖాన్ చెరో రెండు వికెట్లు తీశారు.అయితే, 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు ఏ దశలోనూ రాజస్థాన్ బౌలర్లను ఎదిరించలేకపోయారు. ముఖ్యంగా పవర్‌ప్లేలోనే లక్నో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్ ఆయుష్ బడోని మొదటి ఓవర్లోనే రనౌట్ కాగా, ఆ వెంటనే కెప్టెన్ రిషబ్ పంత్, స్టార్ బ్యాటర్ ఐడెన్ మార్క్రమ్ ఇద్దరూ సున్నా పరుగులకే వెనుదిరిగారు. ఈ ముగ్గురు కీలక ఆటగాళ్లు డకౌట్ అవ్వడం లక్నో ఓటమిని ముందే ఖరారు చేసింది. నికోలస్ పూరన్ (22), హిమ్మత్ సింగ్ (15) కొద్దిసేపు నిలబడే ప్రయత్నం చేసినా రాజస్థాన్ బౌలర్లు వారిని



క్రీజులో పాతుకుపోనివ్వలేదు.

మరోవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ మిచెల్ మార్ష్ ఒక్కడే లక్నో తరపున పోరాటం చేశాడు. కేవలం 39 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసి జట్టును గెలిపిస్తాడని ఆశలు రేపాడు. కానీ, 16వ ఓవర్లో జోఫ్రా ఆర్చర్ వేసిన అద్భుతమైన బంతికి మార్ష్ (55) అవుట్ కావడంతో లక్నో ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో బ్రిజేష్ శర్మ ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి లక్నోను 119 పరుగులకే ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు.

రాజస్థాన్ బౌలింగ్ విభాగంలో ఆర్చర్, బర్గర్, బిష్ణోయ్, జడేజా అంతా కలిసి కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లక్నో నవాబులను కట్టడి చేశారు. వరుసగా మూడు ఓటములతో సతమతమవుతున్న లక్నోకు ఈ పరాజయం మరింత ఆవేదన కలిగించగా, వరుసగా రెండు ఓటముల తర్వాత రాజస్థాన్ మళ్ళీ విజయాల బాట పట్టి పాయింట్ల పట్టికలో టాప్-3 స్థానాన్ని మరింత పదిలపరుచుకుంది.

# సెంచరీ కొట్టావ్ సామీ.. ఇంకేం నేర్చుకుంటావ్?.

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ సంచలనం అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన 31వ మ్యాచ్‌లో 135 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో రికార్డులు సృష్టించిన ఈ కుర్రాడు, మ్యాచ్ అనంతరం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. అంత పెద్ద సెంచరీ బాదినప్పటికీ, తన ఆటలో ఇంకా లోపాలు ఉన్నాయని అభిషేక్ నిజాయితీగా ఒప్పుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.ఢిల్లీపై అభిషేక్ విశ్వరూపంసన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన పోరులో అభిషేక్ శర్మ శివతాండవం చేశాడు. కేవలం 68 బంతుల్లోనే 135 పరుగులు బాదాడు. ఇందులో ఢిల్లీ బౌలర్లు ఎక్కడా అతడిని అడ్డుకోలేకపోయారు. అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్ వల్ల ఎస్ఆర్‌హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 242 పరుగుల భారీ స్కోరు సాధించింది. సమాధానంగా ఢిల్లీ జట్టు 195 పరుగులకే పరిమితమై, 47 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో ఎస్ఆర్‌హెచ్ పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది.

అభిషేక్ బయటపెట్టిన తనలోని లోపం

మ్యాచ్ గెలిచిన తర్వాత అభిషేక్ శర్మ మాట్లాడుతూ.. తనకు డెత్ ఓవర్లలో వేగంగా ఆడటం



రావడం లేదని పేర్కొన్నాడు. "సాధారణంగా నేను పవర్ ప్లేలో ఆడి అవుట్ అవుతుంటాను. కానీ ఈ మ్యాచ్‌లో మొదటిసారి 20 ఓవర్ల పాటు క్రీజులో ఉన్నాను. ఇన్నింగ్స్ చివర్లో బౌలర్లు వేసే స్లో బంతులు, యార్కర్లను ఎదుర్కోవడంలో నేను ఇబ్బంది పడ్డాను. అందుకే చివరి 21 బంతుల్లో కేవలం 33 పరుగులు మాత్రమే చేయగలిగాను. దీనివల్ల నా స్ట్రైక్ రేట్ కూడా పడిపోయింది" అని అభిషేక్ వివరించాడు. ఇకపై డెత్ ఓవర్లలో బ్యాటింగ్ ఎలా చేయాలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటానని అతను చెప్పాడు.ఆర్ అశ్విన్ ప్రశంసలుఅభిషేక్ శర్మలో ఉన్న ఈ నేర్చుకోవాలనే తపనను టీమిండియా వెటరన్ స్పిన్నర్ ఆర్ అశ్విన్ కొనియాడాడు. 135 పరుగులు చేసిన తర్వాత కూడా తన ఆటలో తప్పులను వెతుక్కుని, వాటిని సరిదిద్దుకోవాలనుకోవడం ఒక గొప్ప క్రీడాకారుడి లక్షణమని అశ్విన్ సోషల్ మీడియా వేదికగా మెచ్చుకున్నాడు. అభిషేక్ తన ఇన్నింగ్స్ ఆరంభంలో 25 బంతుల్లోనే 50 పరుగులు చేసి, 47 బంతుల్లోనే సెంచరీ మార్కును చేరుకున్నాడు. కానీ ఇన్నింగ్స్ చివర్లో హెన్రిక్ క్లాసెన్‌కు స్ట్రైక్ ఇచ్చే ప్రయత్నంలో విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రపంచంలోనే రూపాయి తిరుగులేని శక్తిగా మారనుంది! డిప్యూటీ గవర్నర్ సంచలన స్టేట్‌మెంట్

భారత రూపాయి నిర్వహణపై తీసుకున్న తాజా చర్యలు తాత్కాలికమేనని, దీర్ఘకాలంలో కరెన్సీ అంతర్జాతీయాకరణ లక్ష్యానికి దేశం కట్టుబడి ఉందని =దీ× డిప్యూటీ గవర్నర్ టీ.రబీ శంకర్ స్పష్టం చేశారు. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కరెన్సీ మార్కెట్‌లో ఏర్పడిన అస్థిరతను నియంత్రించడానికే మార్చి 30, ఏప్రిల్ 1 తేదీల్లో కొన్ని పరిమిత చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యం మితిమీరిన ఊహాగానాలను అరికట్టడం, అలాగే అమెరికన్ డాలర్‌కు కృత్రిమ కొరత ఏర్పడ కుండా చూడటమని ఆయన వివరిం చారు. అయితే ఈ చర్యలను పూర్తిగా ఎప్పుడు ఉపసంహరిం చుకుంటారన్న విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదు.గమనించదగ్గ విషయం ఏమిటంటే ఈ వారం ప్రారంభంలోనే కేంద్ర బ్యాంక్ కొన్ని పరిమితులను పాక్షికంగా సడలించింది. దీని ప్రకారం అధీకృత డీలర్లు రూపాయికి అనుసంధానమైన డెలివరీ చేయలేని డెరి వేటివ్ కాంట్రాక్టులను మళ్లీ నివాసి, ప్రవాస వినియోగదారులకు అంది ంచేలా అనుమతి ఇచ్చారు. నికర ఓపెన్ పొజిషన్లపై ఉన్న 100 మిలి యన్ డాలర్ల పరిమితిని ఎప్పుడు ఎత్తివేస్తారనే ప్రశ్నకు స్పందిస్తూ, శంకర్ దీర్ఘకాల లక్ష్యాన్ని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా రూపాయిలో లావాదేవీలు జరిగేలా, ఒకే గ్లోబల్ మార్కెట్‌ను




సృష్టించడం ఆర్‌బిఐ లక్ష్యమని ఆయన తెలిపారు. ఇటీవలి చర్యలు కేవలం తాత్కాలిక అస్థిరతను ఎదుర్కొనేందుకే తీసుకున్నవని, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత మామూలు విధానాలకు తిరిగి వస్తామని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలు ఉంటాయా అన్న ప్రశ్నకు, కరెన్సీ విలువ పెరుగుదల లేదా పడిపోవడాన్ని నియంత్రించేందుకు కాకుండా, అసాధారణ ఊహాగానాల వల్ల మార్కెట్‌లో ఏర్పడే అతివేగ మార్పులను అరికట్టడానికే జోక్యం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రూపాయి విలువ ప్రధానంగా డిమాండ్, సరఫరా ఆధారంగా నిర్ణయించ బడుతుందని తెలిపారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైతే కేంద్ర బ్యాంక్ మరిన్ని చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో ఏదైనా ఒత్తిడి కనిపించినప్పుడు, మార్కెట్ స్థిరత్వాన్ని కాపాడటం తమ బాధ్యత అని, చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటామని =దీ× పునరుద్ఘాటించింది.

# ఈ పని చేస్తేనే మీ అకౌంట్లోకి డబ్బులు తప్పనిసరి చేసిన కేంద్రం


దేశంలోని ప్రైవేట్ ఉద్యోగులందరికీ ఊరట కలిగించేలా ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఈపీఎఫ్‌వో సేవలన్నీ ఆటోమేషన్ పద్ధతిలో జరగనున్నాయి. మాన్యువల్ జోక్యం ఇక తగ్గనుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మాన్యువల్ విధానాన్ని ఇక స్వస్తి పలకాలను, ఆటోమేషన్ పద్ధతిలో పీఎఫ్ సేవలు అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం పీఎఫ్ ఖాతాదా రులందరూ తప్పనిసరిగా కేవైసీ సమర్పించాలని సూచించింది. కేవైసీ సమర్పించిన చందాదారులకు సేవలు ఆటోమేటిక్‌గా కొత్త పద్ధతిలోకే మారిపోతాయి. ఈ మేరకు అందరూ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఈపీఎఫ్‌వో ఆదేశించింది. ఆటోమేషన్ పద్ధతి అమలుకు సన్నద్ధం కావాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని యంత్రాగాన్ని ఈపీఎఫ్‌వో ఆదేశించింది.క్లెయిమ్ ఆటో సెటిల్మెంట్ఇప్పటివరకు ఈపీఎఫ్‌వో క్లెయిమ్స్ మాన్యువల్ విధానంలో జరిగేవి. ఖాతాదారుడు ఈపీఎఫ్‌వో పోర్టల్ లేదా




ఉమాంగ్ యాప్‌కి వెళ్లి క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోని అవసరమైన ఆధారాలు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ వంటివి అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం అధికారులు వివరాలు పరిశీలించిన సరిగ్గా ఉంటే క్లెయిమ్ ప్రాసెస్ చేసేవారు. అధికారుల పరిశీలనకు చాలా టైమ్ పట్టేది. ఇక మధ్యలో సెలవు దినాలు వస్తే అధికారులు అందుబాటులో ఉండరు గనుక క్లెయిమ్ ప్రాసెస్ ఆలస్యమయ్యేది. దీని వల్ల ఖాతాదారులకు ఆలస్యంగా నగదు అందేవి. ప్రస్తుతం ఉన్న మాన్యువల్ పేపర్ ప్రాసెస్, అధికారుల ఆమోదం లాంటివి ఇక నుంచి అవసరం లేదు. ఇక నుంచి అధికారుల పరిశీలన అవసరం లేకుండా ఆటోమేటిక్‌గా క్లెయిమ్ ప్రాసెస్ జరిగే వ్యవస్థను ఈపీఎఫ్‌వో అభివృద్ధి చేస్తోంది. ఇది జరిగితే క్లెయిమ్ వేగవంతంగా పరిష్కారం అవుతాయి.ఆధార్, బ్యాంక్ కేవైసీ తప్పనిసరి అయితే వినియోగదారులు వేగంగా ఆటోమేషన్ పద్ధతిలో క్లెయిమ్స్ పొందాలన్నా లేదా ఇతర పీఎఫ్ సేవలు వినియోగించుకోవాలన్నా కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. ఇందుకోసం బ్యాంక్, ఆధార్ కేవైసీ ఈపీఎఫ్‌వో పోర్టల్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఖాతాదారులందూ ఈ పనిని వెంటనే పూర్తి చేయాలని సూచించింది. ఇది పూర్తి చేసినవారికి సిస్టమ్‌నే క్లెయిమ్‌ను ప్రాసెస్ చేస్తోంది. అలాగే ఈమెయిల్స్, ఎస్ఎంఎస్ వంటి అప్డేట్స్ అందుతాయి. అటు ఇనాపరేటివ్ ఖాతాలకు చెక్ పెట్టాలని ఈపీఎఫ్‌వో భావిస్తోంది. అందులో భాగంగా రూ.వెయ్యి కంటే తక్కువ నగదు కలిగిన ఇన్‌ఆపరేటివ్ ఖాతాలకు ఆటోమేటిక్‌గా క్లెయిమ్ చేయనుంది. వారి ఖాతాల్లో వీటిని జమ చేయనుంది. త్వరలో ఇవి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.

# స్టాక్‌లను ఎంపిక చేసుకునే విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చారు

ఇంట్రాడే ట్రేడింగ్ మార్కెట్‌లోకి ప్రతిరోజూ వేలాది మంది కొత్త ట్రేడర్‌లు ప్రవేశిస్తున్నారు. వీరికి ఏ స్టాక్‌లను ఎంచుకోవాలో, ఎప్పుడు ఎంటర్ అవ్వాలి, ఎప్పుడు ఎగ్జిట్ అవ్వాలి, స్టాప్ లాస్ ఎక్కడ పెట్టాలి అనే విషయాలపై స్పష్టత ఉండదు. ఈ అంశాలపై బిజినెస్ నిపుణులు కీలక సలహాలు అందించారు. కొత్త ట్రేడర్‌లు డీమ్యాట్ అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత సరైన మార్గదర్శకత్వం లేక గందరగోళానికి గురవుతారని, అటువంటి వారికి సరైన స్టాక్ ఎంపిక విధానం చాలా ముఖ్యమని వాళ్లు అన్నారు.ఇంట్రాడే ట్రేడింగ్‌కు స్టాక్ ఎంపికలో ప్రధాన పారామీటర్‌గా వాల్యూమ్‌ను చూడాలన్నారు. వాల్యూమ్ అంటే కొనాలన్నా, అమ్మాలన్నా సులువుగా జరిగే లిక్విడిటీ అని అర్థం. మార్కెట్ పెరిగినా, తగ్గినా వాల్యూమ్ ట్రేడ్ కావాలి. మిలియన్స్, క్రోర్స్, లక్షల సంఖ్యలో జరిగే పెద్ద వాల్యూమ్ ఉన్న కంపెనీలను ఇంట్రాడే కోసం ఎంచుకోవాలి. వాల్యూమ్ ఎక్కువగా ఉండే స్టాక్‌లను గుర్తించడానికి, బీఎస్ఈ వెబ్‌సైట్‌లోని సెన్సెక్స్ 30 కంపెనీలు, నిఫ్టీ 50 కంపెనీలను పరిశీలించాలని సిఫార్సు చేశారు. ఈ 30, 50 కంపెనీలు మార్కెట్‌లో అధిక లిక్విడిటీ, వాల్యూమ్‌ను కలిగి ఉంటాయని, ఇవి మార్కెట్ ఇంజిన్ల వంటివని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, ఇంట్రాడే ట్రేడింగ్ చేయాలనుకునే వారు ఈ కంపెనీల నుంచి స్టాక్‌లను ఎంచుకోవచ్చు.స్టాక్‌లను ఎంపిక చేసుకునే విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చారు. మార్కెట్ ఉదయం 9:15 గంటలకు ఓపెన్ అయినప్పటికీ, 9:00 గంటలకు ప్రీ-ఓపెన్ మార్కెట్ ఉంటుందని తెలిపారు. బీఎస్ఈ సెన్సెక్స్‌కు వెళ్లి, 9:00 గంటలకు ప్రీ-ఓపెన్ మార్కెట్‌లో గ్రీన్(పాజిటివ్) రంగులో ఉన్న స్టాక్‌లను గమనించాలి. ఏవైతే టాప్ గెయినర్‌లుగా ఉంటాయో వాటిని రాసుకోవాలని సూచించారు. ఉదాహరణకు, ఒకరోజు టాటా స్టీల్ 9:00 గంటలకు టాప్ గెయినర్‌గా ఉంటే, 3:30 గంటల వరకు కూడా అదే స్థానంలో ఉండే అవకాశం ఉందని ఆయన ఉదాహరించారు.9:15 తర్వాత ఈ స్క్రిప్ట్‌లను పరిశీలించడం, అలాగే రోజు చివరి వరకు వాటి కదలికలను



గమనించడం ద్వారా ట్రేడర్‌లు అనుభవాన్ని పొందుతారు. ప్రీవియస్ క్లోజ్, ఓపెనింగ్ ప్రైస్, లో ప్రైస్‌లను పరిశీలించడం ద్వారా స్టాక్ కదలికలను అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు, టాటా స్టీల్ నిన్న రూ. 1103.50 వద్ద క్లోజ్ అయితే, ఈరోజు రూ. 1124 వద్ద ఓపెన్ అయ్యి, రూ. 1115.35 లోకి వచ్చిందని వివరించారు. ఈ కదలికలను అర్థం చేసుకోవడం ట్రేడింగ్‌కు ముఖ్యమని తెలిపారు. ఎంటర్ అవ్వడం, ఎగ్జిట్ అవ్వడం, స్టాప్ లాస్ పెట్టడం వంటివి ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లలో సులువుగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద, అధిక వాల్యూమ్ ఉన్న, ప్రముఖ కంపెనీల స్టాక్‌లను పరిశీలించడం, ప్రీ-ఓపెన్ మార్కెట్‌లో వాటి పనితీరును గమనించడం ద్వారా బిగినర్‌లు ఇంట్రాడే ట్రేడింగ్‌లో విజయవంతంగా స్టాక్‌లను ఎంచుకోవచ్చని తెలిపారు.

## నయనతార అవుట్.. బాలయ్యకు జోడీగా స్టార్ హీరోయిన్



నందమూరి బాలకృష్ణ సినిమాల కోసం ఆయన అభిమానులు ఎంతగా ఎదురుచూస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యంగ్ హీరోలతో పోటీ పడుతూ వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు బాలయ్య. అంతే కాదు ఇటీవలి కాలంలో బాలయ్య చేసిన సినిమాలు అన్ని బ్లాక్ బస్టర్స్ అవుతున్నాయి. థియేటర్స్ దగ్గర బాలయ్య సినిమాల సందడి మాములుగా ఉండదు.. అభిమానులకు పూనకాలు గ్యారెంటీ. దర్శకనిర్మాతలు కూడా బాలయ్యను అదే రేంజ్ లో అభిమానుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. గతంలో ఈ ఇద్దరి కాంబినేషన్ లో వచ్చిన వీరసింహారెడ్డి సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికి తెలిసిందే..ఇక ఇప్పుడు మరోసారి బాలయ్య, గోపీచంద్ మలినేని కలిసి అభిమానులను ఆకట్టుకోవడానికి రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమాను అనౌన్స్ చేసి ప్రీ లుక్ పోస్టర్స్ ను కూడా విడుదల చేశారు. అలాగే బాలయ్యకు జోడీగా నయనతారను కూడా ఫిక్స్ చేశారు. బాలయ్య, నయనతార కలిసి గతంలో శ్రీరామ రాజ్యం, సింహ, జై సింహ సినిమాల్లో నటించారు. ఇప్పుడు మరోసారి బాలయ్యతో నయన్ జోడీ కట్టనుంది అని అనౌన్స్ చేశారు.. కానీ

## సాయి కుమార్ అమ్మ చనిపోయేముందు డైరీలో నా గురించి రాసింది చూసి షాక్ అయ్యా.!!




నటుడు రాజశేఖర్ తన కెరీర్, వ్యక్తిగత జీవితంలోని కొన్ని ముఖ్యమైన అంశాలపై ఓ ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడారు. తన బహిరంగ స్వభావం, రెమ్యూనరేషన్ విధానం, నత్తి సమస్య, అలాగే తన చిత్రాలకు సాయికుమార్ డబ్బింగ్ చెప్పిన వైనం వంటి విషయాలను పంచుకున్నారు. రాజశేఖర్ తనను తాను ఒక చిన్న పిల్లాడిలాగే భావిస్తానని, ఓపెన్ గా మాట్లాడటం వల్ల అప్పుడప్పుడు సమస్యలు ఎదురవుతాయని అన్నారు. దర్శకుడు ప్రవీణ్ సత్తారు కూడా రాజశేఖర్ లో నచ్చిన విషయం ఓపెన్ గా ఉండటం, నచ్చని విషయం చిన్న పిల్లాడిలా అలుగుతాడు అని సందీప్ కిషన్ తో చెప్పిన సందర్భాన్ని రాజశేఖర్ గుర్తు చేసుకున్నారు. తాను కొన్నిసార్లు చెప్పకూడని వాస్తవాలను కూడా తెలియకుండానే చెప్పేస్తానని, దీనివల్ల కొందరు హర్ట్ అయ్యారని, ఇప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉంటున్నానని తెలిపారు. రెమ్యూనరేషన్ విషయంలో కూడా తాను చాలా సూటిగా ఉంటానని, తన భార్య జీవిత లాగా డీల్స్ ను నెగోషియేట్ చేయలేనని చెప్పారు. తాను కోరిన మొత్తం చెప్పినప్పుడు, అది ఎక్కువైతే నిర్మాతలను దూరం చేసుకునే అవకాశం ఉంటుందని, జీవిత మాత్రం ఎక్కువ చెప్పి తర్వాత తగ్గించుకునేలా చూస్తుందని వివరించారు.తన బాల్యం, విద్యాభ్యాసం గురించి కూడా రాజశేఖర్ ప్రస్తావించారు. తెలుగువాడైనప్పటికీ, చెన్నైలో పుట్టి పెరగడం వల్ల తమిళ మీడియంలో చదువుకున్నానని, తమిళంలో కవిత్వం కూడా రాయగలనని, కానీ తెలుగు చదవడం మాత్రం రాదని తెలిపారు. ఇంట్లో తమిళం మిక్స్ అయిన తెలుగు మాట్లాడేవారట. తన కెరీర్ ప్రారంభంలో తెలుగు సరిగా రాకపోవడం, అలాగే నత్తి ఉండటం తనను చాలా ప్రభావితం చేశాయని చెప్పారు. షూటింగ్ సమయంలో "అమ్మ" వంటి కొన్ని పదాలు పలకడం కష్టంగా ఉండేదట. ఇలాంటప్పుడు తలుపు కొట్టడం వంటి చిన్న చిన్న ఉపాయాలతో ఆ పదం పలకడానికి సహాయం తీసుకునేవారని వివరించారు. ఒకసారి రవిరాజా పినిశెట్టి తలుపు కొట్టకుండా "అమ్మ" అని పలకమని అడిగినప్పుడు, తాను నత్తి సమస్యను వివరించిన తర్వాత ఆయన అర్థం చేసుకున్నారని తెలిపారు. ఈ సమస్యల కారణంగానే దర్శకుడు టి.కృష్ణ సూచన మేరకు సాయికుమార్ తన చిత్రాలకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించారని రాజశేఖర్ వివరించారు.



## ఇండస్ట్రీలో తోప్ హీరోయిన్ అయినా అద్దె ఇంట్లోనే ఉంటున్న బ్యూటీ

సినిమాల్లోనే కాదు సోషల్ మీడియాలో ఈ హీరోయిన్ క్రేజ్ మాములుగా ఉండదు. సినిమాలతో పాటు నెట్టింట కూడా అభిమానులను అలరిస్తూ రచ్చ చేస్తుంటుంది ఈ ముద్దుగుమ్మ. సినిమాల్లో విభిన్నమైన పాత్రలు చేయడమే కాదు. సోషల్ మీడియాలో రకరకాల ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. అందరికంటే ఈ అమ్మడు కాస్త డిఫరెంట్ అనే చెప్పాలి. తెలుగులో ఈ అమ్మడు చేసింది కొన్ని సినిమాలే అయినా విపరీతమైన ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఆమె ఎవరో కాదు ముద్దుగుమ్మ అదా శర్మ. హీరోయిన్ అదాశర్మ. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, నితిన్ కాంబోలో వచ్చిన హార్ట్ ఎటాక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ అందాల భామ. ఈ మూవీ డిజాస్టర్ అయినప్పటికీ యూత్ హార్ట్స్ దొచేసింది ఆదా శర్మ.తెలుగులో ఈ అమ్మడు చేసింది కొన్ని సినిమాలే అయినా విపరీతమైన ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఆమె ఎవరో కాదు ముద్దుగుమ్మ అదా శర్మ. హీరోయిన్ అదాశర్మ. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, నితిన్ కాంబోలో వచ్చిన హార్ట్ ఎటాక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ అందాల భామ. ఈ మూవీ డిజాస్టర్ అయినప్పటికీ యూత్ హార్ట్స్ దొచేసింది ఆదా శర్మ.ఫస్ట్ మూవీతోనే యూత్ లో క్రేజ్ సొంతం చేసుకున్న ఈ వయ్యారికి వరుస ఆఫర్స్ వస్తాయనుకున్నారు. కానీ అలా జరగలేదు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన అదా.. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే సెకండ్ హీరోయిన్ గా కనిపించింది. ఆ తర్వాత అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది.ఫస్ట్ మూవీతోనే యూత్ లో క్రేజ్ సొంతం చేసుకున్న ఈ వయ్యారికి వరుస ఆఫర్స్ వస్తాయనుకున్నారు. కానీ అలా జరగలేదు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన అదా.. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే సెకండ్ హీరోయిన్ గా కనిపించింది.హిందీలో ఆడపాదడపా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటుంది అదా శర్మ. ప్రస్తుతం సరైన అవకాశాల కోసం వెయిట్ చేస్తున్న అదా శర్మ.. ఇప్పుడు ఇన్ స్టాలో సందడి చేస్తుంది.అక్కడే ది కేరళ స్టోరీ అనే సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. కానీ విడుదలకు ముందే ఈ మూవీ వివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ ఇండస్ట్రీలోనూ అదాకు అంతగా ఆఫర్స్ రాలేదు. హిందీలో ఆడపాదడపా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటుంది అదా శర్మ. ప్రస్తుతం సరైన అవకాశాల కోసం వెయిట్ చేస్తున్న అదా శర్మ.. ఇప్పుడు ఇన్ స్టాలో సందడి చేస్తుంది.

## కళ్లు లేకుండా పుట్టింది.. తనని చూస్తే గుండె తరుక్కుపోతుంది.

సెలబ్రెటీలు చాలా మంది ఎమోషనల్ షేర్ చేసుకుంటూ ఉంటారు. తమ జీవితంలో జరిగిన విషయాలను, చేదు అనుభవాలను. కెరీర్ లో ఎదుర్కున్న సమస్యలను పంచుకుంటూ ఉంటారు. కొందరు మీడియా ముందు ధైర్యంగా మాట్లాడితే.. మరికొంతమంది సోషల్ మీడియా ద్వారా తమ భావాలను పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఓ హీరోయిన్ తన పెట్ గురించి చెప్తూ ఎమోషనల్ అయ్యింది. ఓ టీవీ షో వేదిక మీదే కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె ఎవరో కాదు అందాల భామ రెజీనా కాసాండ్రా.. సుధీర్ బాబు నటించిన శివ మనస్సులో శృతి అనే సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించింది అందాల ముద్దుగుమ్మ రెజీనా కాసాండ్రా.. తొలి సినిమాతోనే తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.తాజాగా ఓ హీరోయిన్ తన పెట్ గురించి చెప్తూ ఎమోషనల్ అయ్యింది. ఓ టీవీ షో వేదిక మీదే కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె ఎవరో కాదు అందాల భామ రెజీనా కాసాండ్రా.. సుధీర్ బాబు నటించిన శివ మనస్సులో శృతి అనే సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించింది అందాల ముద్దుగుమ్మ రెజీనా కాసాండ్రా.. తొలి సినిమాతోనే తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ అందుకుంది. అటు తమిళ్ లోనూ, హిందీలోనూ అవకాశాలు అందుకుంది. కానీ అంతగా అక్కడ రాణించలేకపోయింది. ఇక తెలుగులో వరుసగా సినిమాలు చేసి మెప్పించింది రెజీనా అయినా కూడా ఆశించిన స్థాయిలో గుర్తింపు మాత్రం తెచ్చుకోలేకపోయింది ఈ అమ్మడు. స్టార్ హీరోల సినిమాల్లో కనిపించినప్పటికీ లాభం లేకుండా పోయింది.ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ అందుకుంది. అటు తమిళ్ లోనూ, హిందీలోనూ అవకాశాలు అందుకుంది. కానీ అంతగా అక్కడ రాణించలేకపోయింది. ఇక తెలుగులో వరుసగా సినిమాలు చేసి మెప్పించింది రెజీనా అయినా కూడా ఆశించిన స్థాయిలో గుర్తింపు మాత్రం తెచ్చుకోలేకపోయింది ఈ అమ్మడు. స్టార్ హీరోల సినిమాల్లో కనిపించినప్పటికీ లాభం లేకుండా పోయింది.తెలుగులో ఈ అమ్మడు 14 సినిమాల్లో నటించి మెప్పించింది. హీరోయిన్ గానే కాదు స్పెషల్ సాంగ్స్ లోనూ కనిపించి అదరగొట్టింది. మెగాస్టార్ చిరంజీవి సినిమాలో స్పెషల్ సాంగ్ చేసి అదరగొట్టింది.



రెజీనా

## వయసు 52 సంవత్సరాలు.. 365 రోజులు ఇదే తింటాను



తెలుగు చిత్రసీమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న హీరోయిన్ ఆమని. ప్రస్తుతం 52 ఏళ్ల వయసులోనూ ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా కనిపిస్తారు. తన ఈ ఆరోగ్య రహస్యం వెనుక ఉన్న క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని, ఆమె ఎదుగుదలకు తోడ్పడిన కొన్ని ముఖ్య విషయాలను ఆమె వెల్లడించారు. బాల్యం నుంచే ఆరోగ్య సంరక్షణ పట్ల తనకు ఆసక్తి ఆహారపు అలవాట్ల విషయానికి వస్తే, ఆమని అన్ని రకాల ఆహారాలను తింటానని, అయితే తక్కువ పరిమాణంలోనే తీసుకుంటానని తెలిపారు. భోజనం, రాత్రి భోజనం వంటివి ఎప్పుడూ చేస్తానని, కానీ పరిమాణాన్ని తగ్గిస్తానని ఆమె వివరించారు. తాను మాంసాహారం వండడంలో నిపుణురాలినని, బిర్యానీ వంటివి చాలా బాగా వండుతానని, అయితే తాను మాత్రం మాంసాహారం తిననని స్పష్టం చేశారు. చిన్నప్పటి నుంచి మాంసాహారం అంటే తనకు ఇష్టం ఉండదని, తాను విశ్వబ్రాహ్మిణ్ కావడంతో తమ కుటుంబంలో మాంసాహారం తినరని చెప్పారు. అయితే, తన పిల్లలు మాత్రం మాంసాహారం తింటారని, వారికి వండిపెడతానని తెలిపారు.ఆహారపు అలవాట్ల విషయానికి వస్తే, ఆమని అన్ని రకాల ఆహారాలను తింటానని, అయితే తక్కువ పరిమాణంలోనే తీసుకుంటానని తెలిపారు.

## మనిషి చాలా మంచోడే కానీ అది ఒక్కటే చెడ్డ అలవాటు..



క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా, విలన్ గా ఎన్నో సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు నటుడు శివాజీ రాజా. కేవలం సహాయక నటుడిగానే కాదు హీరోగానూ సినిమాలు చేశారు శివాజీ రాజా.. ఓ వైపు వెండి తెరపై సినిమాలతో బిజీగా ఉంటూనే అమృతం సీరియల్ తో బుల్లితెరపై కూడా నవ్వులు పూయించారు. ఇక ఇప్పుడు శివాజీ రాజా హీరో, హీరోయిన్స్ కు తండ్రిగా నటిస్తూ మెప్పిస్తున్నారు. అలాగే పలు ఇంటర్వ్యూలో పాల్గొంటున్నారు ఆయన.. గతంలో శివాజీ రాజా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈక్రమంలోనే టాలీవుడ్ నటుడు దివంగత శ్రీహరి మరణం, దివంగత దాసరి నారాయణరావుతో తన బంధం, అలాగే మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఎన్నికలలో ఎదురైన అనుభవాలపై అనేక కీలక విషయాలను పంచుకున్నారు. డిస్కో శాంతి శ్రీహరి మరణానికి స్నేహితులే కారణమని చేసిన వ్యాఖ్యలపై శివాజీ రాజా స్పందించారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State.
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.